21122024-MAI-04_Layout 1 12/21/2024 2:18 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

డాక్టర్ ఆంజనేయ గౌడ్

కేటీఆర్‌పై సర్కార్ కుట్రలు దేనికి?

'కొండను తవ్వి ఎలుకను పట్టుకున్న' చందంగా ఉన్నది రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి సర్కార్ తీరు. 'ఫార్ములా-ఈ' కార్ రేస్‌లో అవినీతి జరిగిందంటూ ఏడాది నుంచి వెతికి వెతికి మరీ 'చెయ్యి' కాల్చుకున్నది. బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులను ఏదో ఒక రకంగా జైలుకు పంపాలనే ఫ్రస్ట్రేషన్‌తో ఉన్న ప్రభుత్వం 'అడవికి కట్టెలు మోసినట్టు' పసలేని అంశాన్ని భుజానికెత్తుకొని అభాసుపాలయ్యే చర్యలు చేపట్టింది. నిజానికి గడిచిన ఏడాది కాలాన్ని రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ సరిగ్గా ఉపయోగించుకొని ఉంటే, ఇటీవల ముగిసిన మహారాష్ట్ర ఎన్నికల్లోనే కాదు, జాతీయస్థాయిలో కాంగ్రెస్ అధిష్ఠానం చేస్తున్న 'మార్పు' నినాదం భవిష్యత్తుకు బాటలు చూపేది. కానీ, దుందుడుకుతనం, వెగటు మాటలు, అనవసర చర్యలతో చారిత్రక అవకాశాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేజేతులా పాడుచేసుకున్నది. ఫలితంగా ఏడాది కాలంలోనే ఎనలేని వ్యతిరేకతను మూటగట్టుకున్నది.

ఇప్పుడు రాష్ట్ర నలుమూలలా కాంగ్రెస్, రేవంత్ రెడ్డి పేరెత్తితేనే ప్రజలు రాయలేని భాషలో తిడుతున్నారు. రైతులు, యువకులు, మహిళలు, బలహీన వర్గాలు, దళితులు తదితర వర్గాల్లో సర్కార్‌పై సన్నగిల్లిన విశ్వాసానికి సంబంధించిన సమాచారం, ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారానో లేదా సర్వే సంస్థలు, మీడియా వర్గాల ద్వారానో ముఖ్యమంత్రి చెవిలో పడకుండా ఉండకపోవచ్చు. అలాంటప్పుడు ఏడాది నిండాకైనా నింపాదిగా ఆలోచించి, ప్రభుత్వానికి పరువు నష్టం కలిగించిన పాలనా చర్యలపై ఆత్మవిమర్శ చేసుకోవాలి. కానీ, దురదృష్టవశాత్తు సీఎం రేవంత్‌రెడ్డితో సహా మొత్తం మంత్రిమండలి తాము పట్టిన కుందేలుకు మూడే కాళ్లన్నట్టు మొండిగా వ్యవహరిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో అమలు జరిగిన పథకాలపై నిత్యం అవినీతి ఆరోపణలకే రేవంత్ రెడ్డి సర్కార్ కాలమంతా ఖర్చు పెడుతుండటం విడ్డూరం. ఇప్పటికే కాళేశ్వరం, విద్యుత్తు ఒప్పందాలపై కమిషన్‌ల విచారణ పేరిట వితండవాదన వినిపిస్తున్నది చాలదన్నట్టు తాజాగా 'ఫార్ములా-ఈ' రేస్‌ను ముందటేసుకున్నది. రాజకీయ ఆయుధంగా ఈ అంశాన్ని వాడేందుకు కాంగ్రెస్ సర్కార్ కాలుదువ్వుతుండటం మేకపోతు గాంభీర్యాన్ని గుర్తుచేస్తున్నది. అంతేకాదు, రాష్ట్రంలోని ప్రజలందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. లగచర్ల, గురుకులాలు తదితర అనేక సమస్యపైనే కాకుండా, ఆరు గ్యారెంటీల అమలు కోసం కూడా కేటీఆర్ క్రియాశీలకంగా పోరాడుతుండటం, ప్రభుత్వానికి కంటగింపుగా మారిందనే సంగతి పలు సందర్భాల్లో ప్రభుత్వ పెద్దల మాటల వల్ల తేటతెల్లమైపోయింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంత కంటగింపుగా మారినా, ప్రభుత్వ పెద్దలు మోపే నేరారోపణల్లో కనీస వాస్తవికత ఉండకపోతే, తెలంగాణ సమాజం ఎంత ఈసడించుకుంటుందో ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోతే ఎలా? ప్రభుత్వానికి లక్ష్యంగా మారిన కేటీఆర్‌పై మోపబడిన కేసులను పరిశీలిస్తే, రాజకీయాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత దారుణమైన ధోరణులను ప్రవేశపెడుతున్నదో అర్థమైపోతున్నది.

> **అసలు ప్రభుత్వం 'ఫార్ములా-ఈ' రేస్ కేసు విచారణను అవినీతి నిరోధక శాఖకు అప్పగించడమే అవగాహన లోపానికి, కక్షపూరిత దృక్పథానికి అద్దం పడుతున్నది. ఈ మొత్తం 'ఫార్ములా-ఈ' రేస్ వ్యవహారంలో కేటీఆర్ గాని, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ గాని వ్యక్తిగత ప్రయోజనాలకు నయా పైసా వాడుకోనేలేదనే సత్యం విజ్ఞులెవరికైనా తేలికగానే అర్థమవుతుంది. 'ఫార్ములా-ఈ' కార్ రేసింగ్ నిర్వహణ వెనుక నాటి ప్రభుత్వ ఉద్దేశంలో, రాష్ట్ర ప్రయోజనాలు, ప్రతిష్ఠతో ముడిపడిన లక్ష్యాలు తప్ప ఇతర ఏ విధమైన అవినీతి ఆలోచనలకు ఆస్కారమే లేదు.**

నిర్వహణ ఉద్దేశంలో పారదర్శక దృష్టి కోణం ఉండబట్టే మొదటి దఫా రేస్ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం రూ.30 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి, 'గ్రీన్ కో' అనే ప్రైవేట్ పెట్టుబడిదారీ సంస్థను ఒప్పించి, వారితో రూ.110 కోట్ల ఖర్చు పెట్టించింది. ప్రభుత్వం అతి తక్కువ ఆర్థిక భారంతో అంతర్జాతీయ స్థాయి 'ఫార్ములా-ఈ' రేస్ మొదటి ధఫా ఈవెంట్‌ను, నాటి కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్ వేదికగా సమర్థవంతంగా, అత్యద్భుతంగా నిర్వహించింది. దానివల్ల ప్రత్యక్ష, పరోక్ష మార్గాల ద్వారా రాష్ట్రానికి దాదాపు రూ.700 కోట్ల లాభం చేకూరిందని ప్రఖ్యాత నీల్సన్ సర్వే సంస్థ అధ్యయనంలో వెల్లడైంది. ఆర్థిక ప్రయోజనమే కాదు, విపణి హృదయంలో మన హైదరాబాద్ నగరం కొత్త ప్రఖ్యాతిని పొందింది. దీంట్లో అవినీతి ఎక్కడుంది? దీనిపై విచారణాధికారం ఏసీబీకి ఎక్కడిది? నిజానికి రేస్ నిర్వహణ బాధ్యత మొత్తం బీఆర్ఎస్ ప్రభుత్వమే తీసుకోవాల్సిన పరిస్థితి, తర్వాతి ఏడాది రేస్ నిర్వహణ భాగస్వామ్యం నుంచి ప్రభుత్వం కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టే 'గ్రీన్ కో' అనే ప్రైవేట్ సంస్థ చేతులెత్తేయడం ద్వారానే ఏర్పడింది. అయితే, ప్రైవేట్ సంస్థ ఒప్పంద ఉల్లంఘన చేసినట్టు, అంతర్జాతీయ సంస్థ విషయంలో బాధ్యతాయుతంగా నడుచుకునే రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించలేదు కదా! పదేండ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో దేశానికి తలమానికంగా నిలబెట్టే పాలనా విధానాలు అమలుచేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం, ఈ కార్ రేస్ వ్యవహారంలో వెనకడుగు వేసి, రేవంత్‌రెడ్డి సర్కార్ మాదిరిగా రాష్ట్రానికి పరువు నష్టం కలిగించలేదు కదా? అందుకే గ్రీన్ కో తప్పుకున్నా, నాటి సర్కారే అన్నీ తానై రెండో దఫా రేస్‌ను మరింత ఘనంగా నిర్వహించే లక్ష్యంతో నిర్ణయాలు తీసుకున్నది.

> **గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వెనుక రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ చెడిపోరాదనే సదుద్దేశం ఉందేకానీ, మరో సంకుచిత ఆలోచన ఎక్కడుంది? వాస్తవానికి గత ప్రభుత్వం అద్వితీయంగా నిర్వహించిన 'ఫార్ములా-ఈ' రేస్‌ను కొనసాగిస్తే, మళ్లీ కేటీఆర్ పేరు ఎక్కడ వినపడుతుందోనని జడిసి, కుట్రపూరితంగా ఎఫ్ఈవోతో జరిగిన ఒప్పందాన్ని ఉల్లంఘించింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. దాన్ని దాచి కేటీఆర్‌పై అవినీతి నిరోధక చట్టం-1988 సెక్షన్ 13(1), (ఏ) సెక్షన్13 (2) కింద అభియోగాలు మోపడం రేవంత్‌రెడ్డి సర్కార్ అరాచకానికి నిదర్శనం.**

పైగా అల్పబుద్ధితో రెండో దఫా 'ఫార్ములా-ఈ' రేస్‌కు మోకాలొడ్డిన హస్తం ప్రభుత్వమే, తెలంగాణకు పేరు తెచ్చిన కేటీఆర్‌పై ఐపీసీ సెక్షన్ 409, 120 బీ లాంటి కేసులు పెట్టడం రేవంత్ రెడ్డిలోని అమానవీయతను తేటతెల్లం చేస్తున్నది. ఈ సత్యాలను శాసనసభ ద్వారా రాష్ట్ర ప్రజల ముందుంచాలనే బీఆర్ఎస్ పార్టీ 'ఫార్ములా-ఈ' రేస్ అంశాన్ని శుక్రవారం నాడు సభలో చర్చకు పెట్టాలని డిమాండ్ చేసింది. వివిధ వర్గాలపై అక్రమ కేసుల నమోదులో రేవంత్ రెడ్డి సర్కార్ ఇప్పటికే అరుదైన రికార్డును నమోదు చేసుకున్నది. చివరికి ప్రధాన విపక్ష పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌పై కూడా అన్యాయమైన కేసులు పెట్టే దుస్సాహసానికి ఒడిగడుతుంటే, ప్రజలకు పూర్తి సత్యాలు తెలియాల్సిన అవసరం ఉన్నది. కానీ, కుట్రదారుడికి సత్యాలను ఎదుర్కొనే ధైర్యం ఎక్కడుంటుంది? అందుకే శాసనసభలో అధికార పార్టీ దాడులతో దిగజారి వ్యవహరించింది. పవిత్రమైన చట్టసభలో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ ఏకంగా బీఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులకు చెప్పులు చూపించడం కాంగ్రెస్ పార్టీ రౌడీయిజానికి నిలువెత్తు నిదర్శనం.

> **వివిధ వర్గాలపై అక్రమ కేసుల నమోదులో రేవంత్ రెడ్డి సర్కార్ ఇప్పటికే అరుదైన రికార్డును నమోదు చేసుకున్నది. చివరికి ప్రధాన విపక్ష పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌పై కూడా అన్యాయమైన కేసులు పెట్టే దుస్సాహసానికి ఒడిగడుతుంటే, ప్రజలకు పూర్తి సత్యాలు తెలియాల్సిన అవసరం ఉన్నది. కానీ, కుట్రదారుడికి సత్యాలను ఎదుర్కొనే ధైర్యం ఎక్కడుంటుంది? అందుకే శాసనసభలో అధికార పార్టీ దాడులతో దిగజారి వ్యవహరించింది. పవిత్రమైన చట్టసభలో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ ఏకంగా బీఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులకు చెప్పులు చూపించడం కాంగ్రెస్ పార్టీ రౌడీయిజానికి నిలువెత్తు నిదర్శనం.**

అయితే, ఇంకా దిగ్భ్రాంతికి గురిచేసే అంశమేమిటంటే, సభలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని, ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌లు అధికార పార్టీకి వంతపాడి, ప్రజా వ్యతిరేక సర్కార్‌ను ఆకాశానికి ఎత్తడం. ఎంఐఎం ఎప్పుడు ఎలా వ్యవహరిస్తుందో సామాన్యులకూ అంచనా ఉన్నది. అయితే కమ్యూనిస్టు పార్టీ ఏకైక ఎమ్మెల్యే కూనంనేని శైలే అందరికీ ఆశ్చర్యం కలిగిస్తున్నది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా బాకాలూదనంతగా, రేవంత్‌రెడ్డి సర్కార్‌ను ఆకాశానికెత్తడం శాసనసభ సమావేశాలు చూస్తున్నవారందరికీ అసభ్యంగా అనిపించకమానదు. ఏదేమైనా పదేండ్లలో హైదరాబాద్ వైభవానికి, ఐటీ ఎదుగుదలకు, నగర పాలికల నడవడికకు నూతన చైతన్యాన్ని కల్పించి, ప్రగతిపథంలో నడిపించిన కేటీఆర్ గురించి రాష్ట్రంలోని వారికే కాదు, దేశంలోని బుద్ధి జీవులందరికీ తెలిసిందే. పని రాముడి ప్రతిష్ఠకు కళంకం తేవాలనే సర్కార్ కుట్రలు ఎప్పటిలాగే ఇప్పుడు కూడా పటాపంచలవ్వడం పక్కా.

(వ్యాసకర్త: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్)

గీతకార్మికుల రాత మారేదెప్పుడు?

కల్లుగీత వృత్తి ప్రమాదాలతో కూడుకున్నది. అయినప్పటికీ బతుకుదెరువు కోసం చాలామంది గీతకార్మికులు ఈ వృత్తిని కొనసాగిస్తున్నారు. తెలంగాణలో సుమారు 5 లక్షల కుటుంబాలు దీనిపై ఆధారపడి జీవిస్తున్నాయి. వృత్తిలో భాగంగా అనేకమంది ప్రమాదాలకు గురవుతున్నారు. అయితే, గతేడాది ఎన్నికల వేళ గీతకార్మికులకు కాంగ్రెస్ అనేక హామీలిచ్చింది. కానీ, వాటిలో కాటమయ్య రక్షణ కవచం పంపిణీ మినహా ఏ హామీ అమలుకు నోచుకోలేదు. అయితే ఇది కూడా అరకొరగానే అని చెప్పుకోవాలి. ప్రభుత్వ లెక్కల ప్రకారం.. రాష్ట్రంలో సుమారు 2.50 లక్షల మంది గీతకార్మికులుండగా, 10 వేల మందికే ఈ సేఫ్టీ కిట్‌ను అందజేశారు. ఈ ఏడాది జూన్‌లో వీటి పంపిణీ చేపట్టగా.. అప్పటినుంచి సుమారు 16 మంది గీతకార్మికులు ప్రమాదవశాత్తూ చనిపోయారు. జనవరి నుంచి మళ్లీ సీజన్ ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో అందరికీ కిట్‌లు అందేలా చూడాలి.

అంతేకాదు, ఏడాదికాలంలో చనిపోయిన, అవయవాలు కోల్పోయిన వారికి రావాల్సిన రూ.7.90 కోట్ల ఎక్స్‌గ్రేషియాను వెంటనే ఇవ్వాలి. హామీ ఇచ్చినట్టుగా ఎక్స్‌గ్రేషియాను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలి. ఏజెన్సీ ఏరియాలోని గీత కార్మికులకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలి. సొసైటీలను పునరుద్ధరించాలి. యాదాద్రి భువనగిరి జిల్లాలో గత ప్రభుత్వం నిర్మించిన నీరా కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి ఉపాధి కల్పించాలి. హైదరాబాద్‌లోని నీరా కేఫ్‌ను టాడి కార్పొరేషన్‌కు అప్పగించాలి. దాని ద్వారా వచ్చే లాభాలను గీత కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలి. టాడి కార్పొరేషన్ ద్వారా ఇచ్చే ఆర్థికసాయాన్ని కొనసాగించాలి. ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేసి, జనగామ జిల్లాకు ఆయన పేరు పెట్టాలి. గీత కార్మికుల పింఛన్‌ను రూ.4 వేలకు పెంచాలి. మద్యం షాపుల్లో గౌడ్‌లకు ఇస్తున్న 15 శాతం రిజర్వేషన్లను 25 శాతానికి పెంచాలి. గీతకార్మిక సొసైటీల భూములకు రక్షణ కల్పించాలి. ప్రతి సొసైటీకి 5 ఎకరాల భూమి ఇవ్వాలనే జీవో నం.560ని అమలు చేయాలి. హైబ్రీడ్ తాటి, జీలు, ఖర్జూర, ఈత చెట్లను అభివృద్ధి చేసి సొసైటీలకు అప్పగిస్తే యువత ఈ వృత్తి వైపు ఆకర్షితులవుతారు. లేకపోతే వృత్తి అంతరించిపోతుంది. ఇప్పటికైనా గీతకార్మికులకు ఇచ్చిన వాగ్దానాల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలి.

- మేకపోతుల వెంకటరమణ
(రాష్ట్ర అధ్యక్షులు, కల్లుగీత కార్మిక సంఘం)

మార్పు పేరిట ఏమార్చిన కాంగ్రెస్

చాడ సృజన్‌రెడ్డి

> **ఎన్నికల సభల్లో కేసీఆర్ ఒక మాట చెప్పేవారు. మంది మాటలు పట్టుకొని మార్వాణం పోతే, మల్లొచ్చేవరకు ఇల్లు గుల్ల అయితది అని. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు అట్లనే కనిపిస్తున్నాయి. 'కాంగ్రెస్‌కు ఓటు వేసి తప్పుచేశామా' అని ప్రజలు పునరాలోచించుకుంటున్నారు. ఏడాదిలోనే కాంగ్రెస్ ఇంతలా అపకీర్తి మూటగట్టుకోవడానికి ముందుచూపు లేని పాలనే ప్రధాన కారణం. అంతేకాదు, ప్రతీ పనిలో రాజకీయ లబ్ధిని మాత్రమే చూడటం.**

రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఏదో ఒకచోట ఏదో ఒక సమస్య మీద ప్రభుత్వం మీద ప్రజలు పోరాటం చేస్తూనే ఉన్నారు. ఫార్మా కంపెనీ భూముల సేకరణకు వ్యతిరేకంగా లగచర్ల రైతులే కావొచ్చు, గురుకులాల్లో పురుగుల అన్నం పెడుతున్నారని పిల్లలు కావొచ్చు, రైతుబంధు, రుణమాఫీ కోసం అన్నదాతలు కావొచ్చు, మూసీ కూల్చివేతలు, హైడ్రా వ్యవహారం కావొచ్చు, తెలంగాణ తల్లి రూపం మార్చడం కావొచ్చు.. ఇలా ఏదో ఒక సమస్య మీద రాష్ట్రం ఉడుకుతూనే ఉన్నది. ప్రశ్నించేవాళ్లపై కేసులు పెడుతున్నారు, వారిని అరెస్టు చేస్తున్నారు. అసలు ఇది ప్రజాస్వామ్యమా లేక నిరంకుశ పాలనా?

ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ ఎన్నో హామీలను ఇచ్చింది. రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అందులో కీలకమైనవి. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధును బొందపెట్టి, రైతు సంక్షేమాన్ని సంక్షోభంలోకి నెట్టి, మహిళా సాధికారతను ఉచిత బస్సుకే పరిమితం చేశారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు కాంగ్రెస్ బొమ్మలతో నియామక పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. ఈ సంవత్సర కాలంలో అసలు నిజమైన అభివృద్ధి ఎక్కడ జరిగింది? ఒక్క ప్రాజెక్టుకైనా శంకుస్థాపన చేశారా? ఒక్క కొత్త ఉద్యోగమైనా ఇచ్చారా? భూతద్దం పెట్టి వెతికినా తెలంగాణ ఆర్థికంగా కాని, సంక్షేమపరంగా కాని ఆవగింజంత కూడా ముందుకుపోలేదు సరికదా చాంతాడంత వెనక్కిపోయిందని అందరికీ అర్థమవుతూనే ఉన్నది.

ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రతీ పనిలో విజయవంత

మవడానికి ముఖ్యకారణం రాజకీయ కోణంలో కాకుండా కేవలం ఆ పథకాల లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని పనిచేయడమే. ఇక కాంగ్రెస్ విషయానికి వస్తే స్పష్టత లేని సర్కార్ నిర్ణయాలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. అరకొర రుణమాఫీ, అమలుకాని రైతు భరోసా, బోగస్‌గా మారిన బోనస్, లగచర్ల వ్యవహారం, హైడ్రా, మూసీ కూల్చివేతలే అందుకు నిదర్శనం. ప్రతీ పనిని ముందుచూపు లేకుండా, సరైన ఆలోచన లేకుండా, నియమనిబంధనలు పాటించకుండా చేయడం.. ప్రజలను ఇబ్బంది పెట్టడం వీళ్లకు మామూలైంది.

> **హైడ్రా రామబాణాన్ని కేవలం రావణాసురుడి మీద ప్రయోగిస్తేనే ఉపయోగం ఉంటుంది. అంతేతప్ప, సాధారణ ప్రజల మీద ఎక్కుపెడితే అది రాక్షసబాణమే అయితది కదా. హైడ్రా వ్యవహారం కూడా అలాంటిదే. ఉద్దేశం మంచిదే అయినా సరైన మార్గదర్శకాలు, స్పష్టత లేని కారణంగా హైడ్రా ఎవరి ఇల్లు, ఎప్పుడు కూలగొడుతదో అనే భయం ప్రజల్లో ఏర్పడింది. రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. ఆర్థిక రంగం అస్తవ్యస్తమైంది.**

పేదల ఇళ్లను హైడ్రా కూలగొడుతుంటే, ప్రజలు ఉన్నపళంగా రోడ్డు మీద పడుతుంటే యావత్ తెలంగాణ కన్నీరు పెట్టుకున్నది. 'మా వద్ద అన్ని కాగితాలు ఉన్నాయి. ప్రభుత్వ అనుమతులు తీసుకొని ఇల్లు కట్టుకున్నాం. మీరెవరు మా ఇల్లు కూల్చడానికి' అని ప్రజలు ముఖ్యమంత్రిని శాపనార్థాలు పెట్టారు.

మూసీని సుందరీకరించాలా లేక శుద్ధి చేయాలా అంటే నేను కేవలం శుద్ధి చేయాలనే అంట. లండన్‌లోని థేమ్స్ నదిని శుభ్రం చేసి, ప్రాణం పోసిన విధానంపై చాలా సమాచారం సేకరించి నేను గత ప్రభుత్వానికి ఇచ్చాను. అతి తక్కువ ఖర్చుతో మూసీకి ఎలా ప్రాణం పోయాలో ఆలోచించి గత ప్రభుత్వం ఆ పనులను ప్రారంభించింది. మూసీలోకి వెళ్లే డ్రైనేజ్ నీళ్లను మళ్లించి శుద్ధి చేయడం అందులో మొదటిది, కీలకమైనది. అంచెలంచెలుగా మూసీలోకి అపరిశుభ్రమైన నీరు వెళ్లకుండా నియంత్రించి, తద్వారా నీటి కాలుష్యాన్ని నివారిస్తే పరీవాహక ప్రాంతం సుందరంగా మారుతుంది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గత ప్రభుత్వ నిర్ణయాలన్నింటినీ పక్కనపెట్టేసింది. మూసీ సుందరీకరణ పేరిట రూ.1.50 లక్షల కోట్ల బడ్జెట్‌కు తెరలేపింది. ఒక సామాన్య పౌరుడిగా అడుగుతున్నా.. మూసీని శుభ్రం చేస్తే పరీవాహక ప్రాంత ప్రజలకు లాభం జరుగుతుంది కానీ, రివర్ ఫ్రంట్ అంటూ లక్షల కోట్లు వెచ్చిస్తే కాంట్రాక్టర్లకు తప్ప ఎవరికి లాభం?

ఎన్నికలప్పుడు ఎంతో ఆర్భాటంగా రుణమాఫీ చేస్తామని, అందరికీ రైతుభరోసా ఇస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేసింది. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత సరైన పద్ధతిలో రుణమాఫీ చేపట్టకపోవడంతో లక్షల మంది అన్నదాతలకు నిరాశే ఎదురైంది. కౌలు రైతులను అసలు పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో నిర్విరామంగా సాగిన రైతుబంధు కాంగ్రెస్ హయాంలో రైతు భరోసాగా మారి అటకెక్కింది. వడ్లకు బోనస్ అని చెప్పి ఇప్పుడు మాటమార్చి బోగస్‌గా మార్చారు. మొత్తంగా మార్పు మార్పు అని ప్రజలను తప్పుదోవ పట్టించి కాంగ్రెస్ పాలకులు రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేస్తున్నారనడంలో ఏ మాత్రం సంశయించాల్సిన అవసరం లేదు.

(వ్యాసకర్త: ఎన్నారై యూకే)



ప్రజా విశ్వాసం అపహాస్యం

మన దేశ ప్రజాస్వామ్యాన్ని యావత్ ప్రపంచం గమనిస్తున్నది. అయినా మన ప్రవర్తన ద్వారా మనం విఫలమవుతున్నాం. పార్లమెంట్‌లో జరుగుతున్న గందరగోళం, అంతరాయాలు ప్రజల విశ్వాసాన్ని, అంచనాలను అపహాస్యం చేస్తున్నాయి. మీ (ఎంపీలు) మనస్సాక్షిని ఒకసారి ప్రశ్నించుకోవాలని ప్రతి ఒక్క సభ్యుడిని మనసారా కోరుతున్నా.

- జగ్‌దీప్ ధన్‌ఖర్, భారత ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్

మార్పు కావాలంటే కాంగ్రెస్ రావాలంటూ అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్ చేపడుతున్న మార్పు రాజకీయాలు వివాదస్పదంగా మారుతున్నాయి. రేవంత్ తీరును గమనిస్తే తెలంగాణ ప్రజలకు ఏదో చేయాలనే తలంపు కాకుండా, కేసీఆర్‌ను ప్రజల నుంచి దూరం చేయాలనే కక్షతోనే ఆయన ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తున్నది.

విగ్రహాలు కాదు.. బతుకులు మార్చాలె

జీడిపల్లి రాంరెడ్డి
96666 80051

ముఖ్యమంత్రి పదవి శాశ్వతమైనది కాదు. తీన్మార్ మల్లన్న స్టైల్‌లో చెప్పాలంటే సీఎం జీతగాడు మాత్రమే. కానీ, రేవంత్ మాత్రం తనకు అధికారం శాశ్వతమన్నట్టు వ్యవహరిస్తున్నారు. గత ప్రభుత్వాలు ఏర్పాటు చేసినవన్నీ మార్చుకుంటూపోతే ప్రజాధనం వృథాకావడంతో పాటు ఒక ప్రాంతం ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే టీఎస్‌ను టీజీగా మార్చారు. ఆ తర్వాత తెలంగాణ రాజముద్రలో మార్పులు చేసేందుకు ప్రయత్నించి చేతులు కాల్చుకున్నారు. ఇటీవల తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చేశారు. వాస్తవానికి ఉద్యమకాలంలో మనకూ ఒక తల్లి ఉండాలనే భావన మొదలైంది. అయితే, ఉద్యమ ప్రతీకగా తెలంగాణ తల్లిని ముందుకు తేవాలన్న ఆలోచన మాత్రం ఉద్యమ సారథి కేసీఆర్‌దే. ప్రముఖ రచయిత బీఎస్ రాములు, బీయూ ఆర్ చారిలు తెలంగాణ తల్లి విగ్రహానికి రూపం ఇవ్వగా.. గంగాధర్, ఎక్కా యాదగిరిరావు, దుర్గం రవీందర్, కాపు రాజయ్య, ఏలె లక్ష్మణ్ తదితర రచయితలు, జర్నలిస్టులు, ఉద్యమకారులతో సమావేశమై మార్పుచేర్పుల గురించి కేసీఆర్ సూచించారు. వెనుకబడ్డ తెలంగాణకు గుర్తుగా, పేద తల్లిగా తెలంగాణ తల్లి ఎందుకు ఉండాలనే ప్రశ్నను కేసీఆర్ లేవనెత్తారు. కేసీఆర్‌తో పాటు ఇతర మేధావుల సూచనల మేరకు ప్రొఫెసర్ గంగాధర్ తెలంగాణ తల్లికి తుదిరూపమిచ్చారు.

> **తెలంగాణ సంస్కృతికి చిహ్నంగా బతుకమ్మ.. గద్వాల, పోచంపల్లి చీర, కరీంనగర్ వెండి మట్టెలు, కోహినూర్ వజ్రం, జాకబ్ వజ్రం, మక్క కంకులు, బంగారు నగలు, అందమైన కిరీటం, వడ్డాణం, జరీ అంచు చీర, నిండైన కేశ సంపదతో తెలంగాణ తల్లి ప్రాణం పోసుకున్నది. ఉద్యమ కాలంలో ఊరూరా వేల విగ్రహాలు ఏర్పాటయ్యాయి.**

దేశంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా భరతమాత విగ్రహం రూపు మారలేదు. ఏపీలో తెలుగుతల్లి విగ్రహం అలాగే ఉంది. కానీ, మార్పు అంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ మాత్రం తెలంగాణ తల్లిని మార్చేసింది. నాడు ఏర్పాటైన తెలంగాణ తల్లి విగ్రహం కేసీఆరో, బీఆర్ఎస్ పార్టీనో ఏర్పాటు చేయలేదు. కేసీఆర్ సర్కార్ అధికారంలో ఉన్నప్పుడూ కాదు. ఉద్యమసమయంలో మేధావులు, కవులు, కళాకారులు, జర్నలిస్టులు, ఉద్యమకారులతో చర్చించి ఏర్పాటు చేశారు. తెలంగాణ తల్లి కూడా తెలుగు తల్లి, భరతమాత మాదిరిగా సిరిసంపదలకు ప్రతీకగా ఉండాలి. అంతేకానీ, పేద తల్లిగా విగ్రహాన్ని తయారు చేయించడం తెలంగాణ వెనుకబాటుతనానికి నిదర్శనం. అంతేకాదు, తెలంగాణ అస్తిత్వాన్ని, తెలంగాణ ఎదుగుదలను అవమానించడమే. తెలంగాణ ఆడపడుచులకు ప్రతీకగా ఉండే బతుకమ్మను తొలగించడం దారుణం. పండుగలు, పబ్బాలకు పోతే మన ఆడపడుచులు నగలు కచ్చితంగా వేసుకుంటారు. కనీసం రోల్డ్‌గోల్డ్ అయినా ధరిస్తారు. పాలకుల కుటుంబీకులు మాత్రం బంగారు ఆభరణాలతో మెరిసిపోవాలి. మన తెలంగాణ తల్లి మాత్రం బీద తల్లిగా ఉండాలా?

ఇప్పటికైనా ఇలాంటి రాజకీయ ప్రేరేపిత కార్యక్రమాలకు చరమగీతం పాడాలి. తెలంగాణ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ముందుకు సాగవద్దు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలె కానీ, విగ్రహాలు, రాజముద్ర, కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాల్లో కాదు. 'మీ ఇంటికి మా ఇల్లు ఎంత దూరమో, మా ఇంటికి మీ ఇల్లు అంతే దూరం అన్నట్లు భవిష్యత్‌లో అధికారంలోకి వచ్చే పార్టీలు రేవంత్ మార్పు కార్యక్రమాలను మార్చడం ఖాయం.